క్లుప్తంగా

వరద నీటి మళ్లింపునకు ప్రత్యామ్నాయ చర్యలు


డ్రైనేజీ శుభ్రం చేస్తున్న మున్సిపల్ సిబ్బంది

మెట్‌పల్లి: పట్టణంలో శనివారం సాయంత్రం నుంచి కురుస్తున్న వర్షంతో పలు చోట్ల రోడ్లు జలమయమయ్యాయి. డ్రైయినేజీలు పొంగి నీరు రోడ్లపైకి వచ్చి చేరింది. దీంతో రాకపోకలకు ఆటంకాలు ఏర్పడడంతో సమాచారమందుకున్న మున్సిపల్ అధికారులు వెంటనే జేసీబీతో ఆయా ప్రాంతాల్లో నీటిని తొలగించారు. అలాగే లోతట్టు ప్రాంతాలను పరిశీలించారు. వరద నీటితో సమస్యలు ఏర్పడితే తక్షణమే మున్సిపల్ సిబ్బందికి సమాచారమివ్వాలని స్థానికులకు సూచించారు.

లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


గుల్లపేట-పొలాస మధ్య రోడ్డాంను పరిశీలిస్తున్న ఆర్డీవో

జగిత్యాల రూరల్: భారీ వర్షాల దృష్ట్యా లోతట్టు ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆర్డీవో మధుసూదన్ అన్నారు. ఆదివారం సాయంత్రం జగిత్యాల రూరల్ మండలం గుల్లపేట–పొలాస మధ్య ఉధృతంగా ప్రవహిస్తున్న వాగును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాల దృష్ట్యా ప్రజలు వాగులవైపు వెళ్లవద్దని, చెరువులు, కుంటల వైపు కూడ వెళ్లకుండా జాగ్రత్తగా ఉండాలని, రైతులు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఆయన వెంట రూరల్ తహసీల్దార్ రాంమోహన్, ఆర్ఐ భూమయ్య ఉన్నారు.

గోదావరి పరివాహక ప్రజలు..


ఎర్దండి వద్ద గోదావరి పరిశీలిస్తున్న ఆర్ఐలు

ఇబ్రహీంపట్నం: గోదావరి పరివాహక ప్రజలు అప్రమతంగా ఉండాలని ఆర్ఐలు గంగాధర్, రమేశ్‌లు కోరారు. ఆదివారం భారీ వర్షాలు పడుతుండటంతో ఇబ్రహీంపట్నం మండలం ఎర్దండి వద్ద గోదావరి ఉధృతిని పరిశీలించారు. ఎగువ కురుస్తున్న భారీ వర్షాలకు శ్రీ రాంసాగర్ ప్రాజెక్టు నుంచి ఏ సమయంలోనైనా గోదావరిలోకి నీటిని విడుదల చేయనున్నందున గోదావరివైపు ఎవరు వెళ్లకూడదని, చేపలు పట్టేందుకు కూడా ఎవరు పోకూడదని గ్రామస్తులకు వివరించారు. కార్యక్రమంలో కారోబార్ రత్నం, గ్రామస్తులు పాల్గొన్నారు.

భూపతిపూర్‌లో మన ఊరు-మన బాధ్యత


అవగాహన కల్పిస్తున్న టీచర్లు, విద్యార్థులు

రాయికల్: మండలంలోని భూపతిపూర్‌లో పరిసరాల పరిశుభ్రత మన ఊరు–మన బాధ్యత కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఉపాధ్యాయులు బొల్లె చిన్నయ్య, విద్యార్థులు గ్రామంలోని వాడవాడల తిరిగి ప్లాస్టిక్, చెత్త తొలగించారు. ప్లాస్టిక్ వాడ వద్దని, ప్రచారం చేశారు. కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ మహేశ్వర్ రావు, మాజీ సర్పంచ్ జక్కుల చంద్రశేఖర్, వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షుడు ముత్యం రెడ్డి, మాజీ ఎస్ఎంసీ చైర్మన్ రాజేంద్ర ప్రసాద్, ఉపాధ్యాయులు రాజగోపాల్, రమేశ్ బాబు, నారాయణ, గోపాల్, గ్రామస్తులు పాల్గొన్నారు

ఉపాధ్యాయుడికి సన్మానం

రాయికల్: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాల తెలుగు పండితుడు చెరుకు మహేశ్వర శర్మ ను హైదరాబాద్ బ్రాహ్మణ సంక్షేమవేదిక ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సన్మానించారు. శ్రీ సాయి త్రిశక్తి పీఠం నిర్వహించిన శ్రీ గురుభ్యోనమః కార్యక్రమంలో భాగంగా ఆయనన సన్మానించారు. కార్యక్రమంలో సంస్కృత పండితులు కుప్పా శ్రీనివాస శాస్త్రి, బిర్లామందిర్ ప్రధాన అర్చకులు లక్ష్మీనరసింహాచార్యులు, బ్రాహ్మణ సంక్షేమ వేదిక వ్యవస్థాపక కార్యదర్శి బాల శ్రీనివాసులు, మోహన్ కుమార్ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.


ఇబ్రహీంపట్నం మండలం వర్షకొండలో మత్తడి దుంకుతున్న పెద్ద చెరువు


జలమయమైన ధర్మపురి ఆలయ పరిసరాలు


ఏఎస్ఆర్ తండాలో కల్వర్టుపై వరదనీరు


ఉధృతంగా ప్రవహిస్తున్న రాయికల్ పెద్దచెరువు


గంభీర్‌పూర్‌లో ఓ ఇంట్లోకి చేరిన వర్షపునీరు


జగిత్యాల రూరల్: భారీగా ప్రవహిస్తున్న బొల్లెవాగు


పెగడపల్లి: ఆరవెల్లి బ్రిడ్జిపై ప్రవహిస్తున్న నీరు


జగిత్యాల- ధర్మపురి రహదారిలో అనంతారం వద్ద నీట మునిగిన రోడ్డాం


సారంగాపూర్ మండలం కమ్మునూర్ వద్ద గోదావరి ఉధృతి


ఉధృతంగా ప్రవహిస్తున్న కోరుట్ల పూల్ వాగు


కథలాపూర్ మండలం ఇప్పపెల్లి శివారులో నిలిచిన రాకపోకలు


ఇటిక్యాల కల్వర్టుపై భారీగా నీటి ప్రవాహం


జగిత్యాలలో రోడ్లపై నిలిచిన వర్షపు నీరు


లంబాడిపల్లిలో పోచమ్మ ఆలయం వద్ద వాగు

జోరు వాన..

- జిల్లా వ్యాప్తంగా భారీ వర్షం
- పొంగిన వాగులు, వంకలు
- పలు గ్రామాల మధ్య నిలిచిన రాకపోకలు
- స్తంభించిన జన జీవనం

జగిత్యాలరూరల్: జగిత్యాల రూరల్, అర్బన్ మండలాల్లోని అన్ని గ్రామాల్లో శనివారం రాత్రి నుంచి కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. పెర్కపల్లి, హన్మాజీపేట, తిప్పన్నపేట, గోపాల్‌రావుపేట గ్రామాల్లో బొల్లెవాగు ఉధృతంగా ప్రవహించడంతో పంట పొలాలు నీటమునిగాయి. అలాగే జగిత్యాల – ధర్మపురి జాతీయ రహదారిపై అనంతారం రోడ్డాంపై నుంచి వరద ప్రవహిస్తుండడంతో రాక పోకలు నిలిసిపోయాయి.
కోరుట్ల/కోరుట్ల రూరల్: కోరుట్ల పట్టణంతో పాటు మండలంలో ఆదివారం భారీ వర్షం కురిసింది. భారీ వర్షానికి మండలంలో వాగులూ, వంకలూ పొంగి ప్రవహించాయి. మండలంలో ప్రవహించే పెద్ద వాగు ఈ వర్షా కాలంలో మొదటి సారి ఉప్పొంగి ప్రవహించింది.దీంతో సంగెం–యెఖీన్‌పూర్, సంగెం–కోరుట్ల మధ్య లికు రోడ్డు రాక పోకలు నిలిచిపోయాయి. కల్లూర్–సర్పరాజ్‌పూర్ గ్రామాల మధ్య వాగు లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహించటంతో కోరుట్ల నుంచి పైడిమడుగు, రాయికల్ మండలాలకు వెళ్లే రాక పోకలు నిలిచి పోయాయి.
మల్యాల: మల్యాల మండలంలోని పలు గ్రామాల్లోని వాగులు పొంగిపొర్లాయి. లంబాడిపల్లి లో వాగు పొంగిపొ పొర్లడంతో పోచమ్మ ఆలయ సమీపంలోని ధాన్యం కొనుగోలు కేంద్రం జలమయం అయింది.
రాయికల్: పట్టణంతోపాటు మండలంలోని 32 గ్రామాల్లో శనివారం రాత్రి నుంచి ఆదివారం వరకు కురుస్తున్న కుండపోత వర్షంతో రోడ్లన్నీ జలమయ్యాయి. మండలంలోని సింగరావుపేట, ఇటిక్యాల,మూటపెల్లి కల్వర్టులపై వర్షపు నీరు ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి.
సారంగాపూర్: సారంగాపూర్, బీర్‌పూర్ మండలాల్లో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న భారీ వర్షాలతో వాగులు, వంకలు పొంగిపొరితున్నాయి. కోనాపూర్ వద్ద గతంలో ఏర్పాటు చేసిన అప్రోచ్ రోడ్డు వరద ఉధృతికి కొట్టుకుపోవడంతో రెవెన్యూ అధికారులు బారికేడ్లను ఏర్పాటు చేసి, వంతెనపై నుండి వాహణాలు వెళ్లేలా చర్యలు తీసుకున్నారు. రోళ్లవాగు ప్రాజెక్టులోకి భారీ వరద నీరు వచ్చి చేరుతుంది. కడెం ప్రాజెక్టు నుంచి దిగువకు 1 లక్ష క్యూసెక్కులు వదలడంతో గోదావరి తీరం వెంబడి గ్రామాల ప్రజలను అప్రమత్తం చేసినట్లు తహసీల్దార్ శ్రీనివాస్, ఆర్ఐ శ్రీనివాస్‌లు పేర్కొన్నారు.
కథలాపూర్: మండలంలో కురిసిన భారీ వర్షానికి ప్రజలు ఇక్కట్లపాలయ్యారు. కోరుట్ల– వేములవాడ రూట్‌లో ఇప్పపెల్లి గ్రామశివారులో ఒర్రె ఉధృతంగా పారడంతో రాకపోకలు కాసేపు నిలిచిపోయాయి. పోతారం శివారులో, తాండ్ర్యాల గ్రామ శివారులో వాగులు ఉధృతంగా పారి రోడ్డుపై నీళ్లు చేరడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందిపడ్డారు. గంభీర్‌పూర్, కలిగోట, భూషణరావుపేట గ్రామాల్లో పలువురి ఇళ్లలోకి వర్షపునీరు చేరింది.
ధర్మపురి: ధర్మపురిలో ఆదివారం కురిసిన భారీ వర్షంతో చిరు వ్యాపారుల సామాన్లు పూర్తిగా నానిపోయాయి. దీంతో వర్తక వ్యాపారస్తులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.
మెట్‌పల్లిరూరల్: మెట్‌పల్లి మండలంలో భారీ వర్షం కురిసింది.ఆదివారం ఏడతెరిపి లేకుండా కురిసిన వర్షానికి వాగులు,వంకలు పొంగి పొర్లుతున్నాయి.పలుచోట్ల రాకపోకలు నిలిచిపోగా ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.రంగారావుపేట పెద్ద చెరువు మత్తడి దూకుతుండడంతో దిగువన ఉన్న ఒర్రె ప్రవాహం పెరిగింది. దీంతో అల్లూరి సీతారామరాజు తండా(ఏఎస్ఆర్ తండా) శివారులోని కల్వర్టుపై నుంచి వరద నీరు భారీగా ప్రవహించడంతో రాకపోకలు నిలిచిపోయాయి. వెల్లుల –చౌలమద్ది,వెల్లుల–మాసాయిపేట మధ్యలో రహదారిపై వరదనీరు వెళ్తోంది.
ఇబ్రహీంపట్నం: మండలంలో కురుస్తున్న భారీ వర్షాలకు చెరువులు, కుంటలు నిండి మత్తడి నుంచి పొంగి ప్రవాహిస్తున్నాయి. యామాపూర్ – ఫకీర్ కొండాపూర్ వెళ్లే దారిలో వేసిన తాత్కాలిక రోడ్డు నీటి ప్రవాహానికి కొట్టుకపోయి, రాకపొకలు నిలిచిపోయాయి. వేములకుర్తిలో ఆదివారం సాయంత్రం ఎడపల్లి శ్రీనివాస్ పెంకుటిల్లుపై పిడుగు పడింది.

కోరుట్ల మార్కెట్ కమిటీ ప్రమాణ స్వీకారం


ఎమ్మెల్యే వివేక్, నర్సింగరావును సన్మానిస్తున్న నాయకులు

కోరుట్ల/కోరుట్ల రూరల్: రాష్ట్రంలో రైతుల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఎమ్మెల్యే వివేక్ వెంకట స్వామి అన్నారు. కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన పాలక వర్గ ప్రమాణ స్వీకారానికి ఆదివారం హాజరై మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలో రైతులను ఎవరూ పట్టించుకోలేదని నూతనంగా ఏర్పడ్డ తమ ప్రభుత్వం రైతులను అన్ని విధాలా ఆదుకుంటుందన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ. 2 లక్షలు వ్యవసాయ రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో కష్టపడి పనిచేసే వారికి తప్పక గుర్తింపు ఉంటుందన్నారు. ప్రజాపాలన కాంగ్రెస్ హాయంలోనే సవ్యంగా సాగుతుందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి హాయంలో రైతులకు మేలు జరిగిందన్నారు. మచ్చలేని కాంగ్రెస్ నాయకులు, మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్‌రావు మార్గదర్శకత్వంలో రాజకీయాల బాటలో ఉన్నామన్నారు. కాంగ్రెస్ నియోజకవర్గ ఇంచార్జి జువ్వాడి నర్సింగరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం రైతు సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తుందన్నారు. కాంగ్రెస్ పార్టీలో పనిచేసే వారందరికి పదవులు దక్కుతాయన్నారు. అంజిరెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా రైతులకు ఉపయోగకరంగా వ్యవహరిస్తారని అన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల గెలుపు కోసం కృషి చేయాలని కోరారు. అనంతరం మార్కెట్ కమిటీ చైర్మన్‌గా పన్నాల అంజిరెడ్డి, వైస్ చైర్మన్‌గా పుల్లూరి వెంకటేశ్‌గౌడ్, డైరెక్టర్లు ప్రమాణస్వీకారం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు అన్నం అనిల్, తిరుమల గంగాధర్, జలపతిరెడ్డి, మున్సిపల్ వైస్ చైర్మన్ పవన్, నాయకులు, కార్యదర్శి ప్రసాద్ పాల్గొన్నారు.

గొల్లపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్‌గా సంతోష్


భీమ సంతోష్

గొల్లపల్లి : వ్యవసాయ మార్కెట్ అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తానని గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భీమ సంతోష్ అన్నారు. గొల్లపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ నూతన కార్యవర్గాన్ని ఆదివారం నియమించారు. చైర్మన్‌గా భీమ సంతోష్, వైస్ చైర్మన్‌గా పురపాటి రాజిరెడ్డి లను నియమిస్తూ వ్యవసాయశాఖ కార్యదర్శి రఘునందన్ రావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ సందర్భంగా సంతోష్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీ చైర్మెన్‌గా తన నియామకానికి సహకరించినందుకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రుణమాఫీపై కుట్ర

మేడిపల్లి: రైతు సంఘం అధ్యక్షులమని చెప్పుకుంటూ కొందరు రైతులని ధర్నాలకు రావాలని, లేదంటే వెయ్యి రూపాయలు జరిమానా విధిస్తామని భయాందోళనకు గురిచేసినట్లు తమ దృష్టికి వచ్చిందని, అలాంటి దొంగ అధ్యక్షులను నమ్మవద్దని కాంగ్రెస్ నాయకులు అన్నారు. అర్హులైన రైతులకు రుణమాఫీ కాకుంటే కాంగ్రెస్ నాయకుల దృష్టికి, లేదా వేములవాడ ఎమెల్యే ఆదిశ్రీనివాస్ దృష్టికి నేరుగా తీసుకుపోవాలని కోరారు. కార్యక్రమంలో మేడిపల్లి–భీమారం మండలాల అధ్యక్షులు ఏనుగు రమేష్‌రెడ్డి, సింగిరెడ్డి నరేష్‌రెడ్డి, చేపూరి నాగారాజు, గడ్డం జలందర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మెరుగైన వైద్య సేవలు అందించాలి

కోరుట్ల రూరల్: పట్టణ ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కాంగ్రెస్ కోరుట్ల సెగ్మెంట్ ఇన్‌చార్జి జువ్వాడి నర్సింగరావు అన్నారు. పట్టణంలోని వాసుదేవ ఆస్పత్రి నూతన భవనాన్ని నర్సింగరావు ఆదివారం ప్రారంభించారు. నూతన ఆసుపత్రి భవనంలో అధునాతన సౌకర్యాలు కల్పించటం అభినందనీయమన్నారు. ఆస్పత్రి వైద్యులను అభినందించారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ ఆడెపు కమలా మధు, తదితరులు పాల్గొన్నారు.

మున్నూరుకాపు సంఘ నూతన కార్యవర్గం

వెల్గటూర్ : మండలంలోని స్తంభంపల్లి గ్రామ మున్నూరుకాపు సంఘం నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గ్రామంలోని మున్నూరుకాపు సంఘ భవనంలో జరిగిన సమావేశంలో అధ్యక్షుడిగా పాదం దుబ్బస్వామి, ఉపాధ్యక్షులుగా గోరువంతుల సతీష్, రాజన్నలు, కోశాధికారిగా గోరువంతుల మహేష్, ప్రధాన కార్యదర్శిగా తర్ర భూమయ్య, సంయుక్త కార్యదర్శిగా హరిప్రశాంత్, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా సప్పలింగయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా దుబ్బస్వామి మాట్లాడుతూ తనపై నమ్మకంతో తనను అధ్యక్షుడిగా ఎన్నుకున్న సంఘ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు.

అంబేద్కర్ యువసేన అధ్యక్షుడిగా రాజేశ్
రాయికల్: అంబేద్కర్ యువసేన పట్టణ అధ్యక్షుడిగా మారంపల్లి రాజేశ్, ఉపాధ్యక్షులుగా లింగంపల్లి వేణు, ప్రధాన కార్యదర్శిగా పాలెపు నాగరాజు, కార్యదర్శిగా బట్టు ప్రవీణ్, కోశాధికారిగా నిగ స్వామి లను ఆదివారం ఎన్నుకున్నారు.ఈ సందర్భంగా రాజేశ్ మాట్లాడుతూ సంఘ పటిష్టత కోసం కృషి చెస్తామన్నారు.

మల్లాపూర్ ఎంపీడీవో(ఇన్‌చార్జి)గా తండ జగదీశ్
మల్లాపూర్: మండల ఎంపీడీవోగా(ఇన్ చార్జి) తండ జగదీశ్‌ను నియమిస్తూ జెడ్పీ సీఈవో గౌతమ్ రెడ్డి ఉత్తర్వులు జారీ చేశారు. ఎంపీడీవో రాజేందర్ రెడ్డి శనివారం పదవీవిరమణ చేయడంతో ఎంపీవో జగదీశ్ కి ఇంచార్జి ఎంపీడీవోగా అదనపు బాధ్యతలు అప్పగిస్తూ సీఈవో ఉత్తర్వులు జారీ చేశారు.

సామూహిక కుంకుమార్చన


కుంకుమార్చనలో బల్దియా చైర్‌పర్సన్ జ్యోతి

జగిత్యాలటౌన్: పట్టణంలోని పురాణిపేట శ్రీ లోకమాత పోచమ్మ తల్లి ఆలయ వార్షికోత్సవాలను పురస్కరించుకుని ఆదివారం సామూహిక కుంకుమార్చన నిర్వహించారు. బల్దియా చైర్‌పర్సన్ అడువాల జ్యోతి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుంకుమ పూజ లక్కీడిప్ గెలుపొందిన మహిళలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ మూలస్తం లలిత, ఆలయ కమిటీ అధ్యక్షుడు గాజుల రాజేందర్, సభ్యులు, ఆలయ పూజారి అంగడి మఠం చరణ్, కాంగ్రెస్ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

నిరుపేదలకు వరం సీఎం సహాయనిధి

- ఎమ్మెల్యే సంజయ్‌కుమార్


చెక్కు అందిస్తున్న ఎమ్మెల్యే సంజయ్‌కుమార్

జగిత్యాలరూరల్: నిరుపేదలకు సీఎం సహాయనిధి వరం లాంటిదని ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. ఆదివారం జగిత్యాల రూరల్ మండలం హైదర్‌పల్లెకు చెందిన దారుకోట మల్లమ్మ అనారోగ్యంతో బాధపడుతుండగా, శస్త్రచికిత్స చేయించుకునే ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ రూ.2.50 లక్షల ఎల్‌వోసీని వారి కుంటుంబసభ్యులకు అందజేశారు.

కల్లూర్ వాగును పరిశీలించిన జెడ్పీ డిప్యూటీ సీఈవో

కోరుట్ల రూరల్: మండలంలోని కల్లూర్ శివారులో ప్రవహిస్తున్న పెద్ద వాగును జెడ్పీ డిప్యూటీ సీఈవో రఘువరన్ ఆదివారం పరిశీలించారు. భారీ వర్షాల నేపథ్యంలో వాగు పొంగి లోలెవల్ వంతెనపై నుంచి ప్రవహిస్తుండటంతో డిప్యూటీ సీఈవో వంతెనను పరిశీలించి ప్రయాణికులు వంతెనపై నుంచి వెళ్లకుండా చూడాలని స్థానికులకు సూచించారు. ఆయన వెంట ఎంపీ డీవో రామకృష్ణ, ఎంపీవో, గ్రామ పంచాయతీ కార్యదర్శి ఉన్నారు.

ఉద్యోగం సాధించిన యువకుడికి సన్మానం
మల్యాల: మండలంలోని ముత్యంపేట గ్రామానికి చెందిన సింగిరెడ్డి వంశీధర్ రెడ్డిని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈఈగా ఉద్యోగం సాధించిన ఆదివారం స్థానిక గుడేటి రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా శాలువా కప్పి, అభినందించారు. కార్యక్రమంలో బద్దం తిరుపతి రెడ్డి, సంత ప్రకాశ్‌రెడ్డి, సుదర్శన్ రెడ్డి, స్వామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరికి ఎల్‌వోసీ మంజూరు
కథలాపూర్: మండలంలో ఇద్దరికి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ఎల్‌వోసీ మంజూరు చేయించినట్లు కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు కాయితి నాగరాజు ఆదివారం తెలిపారు. భూషణరావుపేట గ్రామానికి చెందిన బి లక్ష్మికి రూ. 1.75 లక్షలు, కథలాపూర్‌కు చెందిన సీహెచ్ ముత్తయ్యకు రూ.1.50 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారన్నారు. వీరికి హైదరాబాద్‌లోని నిమ్స్‌లో వైద్య ఖర్చుల కోసం మంజూరైనట్లు ఆయన పేర్కొన్నారు.

నేడు హిందూ ఆత్మీయ సమ్మేళనం
ధర్మపురి: పట్టణంలో నేడు విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో హిందువుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నారు. విశ్వహిందూ పరిషత్ 60 వసంతాలు పూర్తి చేసుకున్న సందర్భంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నాయకులు తెలిపారు. స్థానిక ఎస్ఆర్ఆర్ గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు సమ్మేళనం ఏర్పాటు చేస్తున్నారు. .